


28న పాడేరులో జాబ్ మేళా

ప్రజాశక్తి-పాడేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభి వృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 28న (గురువారం) ఉదయం 10గంటల నుండి సాయంత్రం 3గంటల వరకు 4 కంపెనీలతో పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి రోహిణి , గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో నవత రోడ్ ట్రాన్స్పోర్ట్, అపోలో ఫార్మసీ, రుద్ర కార్పొరేట్ సర్వీసెస్, మదర్ అండ్ ఫాధర్ హెూమ్ కేర్ సర్వీసెస్ కంపనీలు పాల్గొంటున్నాయని తెలిపారు.జిల్లాలోని 18 సంవత్సరాల నుండి 30 ఏళ్ల ,మధ్య గల పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఆపై చదువు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూ కు పాన్ కార్డు, ఆధార్ కార్డు , సరిఫికేట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు . ఇంటర్వ్యూ లో ఎంపిక కాబడిన అభ్యర్ధులకు నెలకు జీతం రూ.10,000 నుండి 20,000 వరకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్:6302 636174, 9398338 105 సంప్రదించాలన్నారు.

విద్యారంగంలో సమస్యలను పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-పెదబయలు: విద్యారంగంలో సమస్యలను పరిష్కారం చేయాలని పెదబయలు మండల కేంద్రంలో గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి ధర్నా నిర్వహించారు. వసతి గృహల్లో మౌలిక సదుపాయలు కల్పించాలని నినాదాలు చేశారు. విద్యార్థులు సమస్యలను ఎన్నిమార్లు జిల్లా యంత్రాంగానికి తెలిపినా పట్టించుకోలేదని, ప్రభుత్వం మొండి వైఖరి నశించాలంటూ నినాదాలు చేశారు. గురుకుల కళాశాల, పాఠశాలల్లో విద్యార్థులకు తక్షణమే స్వెటర్స్ పంపిణీ చేయాలని నినదించారు. రన్నింగ్ వాటర్ ఏర్పాటు చెయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్తీక్, కార్యదర్శి శ్రీను మాట్లాడుతూ, పాడేరు ఏజెన్సీ 11 మండలాల్లో గురుకుల కళాశాలలో పూర్తిస్థాయిలో కాలేజ్ యూనిఫామ్ పంపిణీ చేయాలని డిమాండ్ చేసారు. సోలార్ హీటర్స్‌ను అందించాలన్నారు. గురుకుల కళాశాల, విద్యార్థులకు పూర్తిస్థాయిలో యూనిఫాం దుస్తులు పంపిణీ చేయాలన్నారు. సుమారుగా 10 నుంచి 15 సంవత్సరాలుగా ఉపాధ్యాయులుగా కొనసాగుతున్న ఔట్సోర్సింగ్ టీచర్స్‌ని రెగ్యులర్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేసారు పెద బయలు జెడ్పి హైస్కూల్ విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్ ఏర్పాటు చేయాలని, ఆగిపోయిన జెడ్పి ఇంటర్మీడియట్, కాలేజ్ భవనాలను పూర్తిస్థాయిలో నిర్మాణం చేయాలంటూ డిమాండ్ చేసారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించకుంటే విద్యార్థులతో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు సమ్మె దీక్షలపై స్పందించి వెంటనే ఔట్సోర్సింగ్ నుంచి కాంట్రాక్ట్ విధానంలో రెగ్యులర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు. ప్రవీణు, రాఖి, హిందూ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి- పాడేరు: రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ కనబరిచి బంగారు, కాంస్య పతకాలు సాధించారు: ఈనెల నవంబరు 9 10 వ తేదీలలో అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు నిర్వహించారు. దీనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని గోల్డ్ మెడల్ అండ్ కాంస్య పతకాలను సాధించారు. జి.అశోక్ (సెకండ్ బీకాం) పి.బుజ్జి బాబు (బి ఎ స్పెషల్ తెలుగు) వీరిద్దరూ గోల్డ్ మెడల్ సాధించారు. కే.దేవమ్మ సెకండ్ బిఎస్సి కంప్యూటర్ సైన్స్. జి రమణ బాబు సెకండ్ బిఎ వీరిద్దరూ కాంస్య పథకాలను సాధించారు. ఈ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ చిట్టి అబ్బాయి, వైస్ ప్రిన్సిపాల్ రసూల్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ పి కోటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ రమేష్ బాబు, గణేష్, దామోదర్‌రావు, ప్రసాద్ నాయుడు అభినందించారు.

గంజాయి పంటలను ధ్వంసం చేయాలి

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: మండలంలో గంజాయి పంటలను ధ్వంసం చేయాలని స్థానిక ఎస్ఐ జి రామకృష్ణ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల సహకారంతో పంటను గుర్తించి ధ్వంసం చేయడం జరిగిందన్నారు. ఎవరైనా గంజాయి సాగు కొనసాస్తే సదరు పంటలను స్వచ్ఛందంగా ధ్వంసం చేయాలని సూచించారు. గంజాయి పంటలకు సంబంధించిన పూర్తి సమాచారం పోలీస్ శాఖ వద్ద ఉందన్నారు. సమాచారాన్ని పోలీస్ స్టేషన్ నెంబరం 9440904233కు తెలియజేయాలని కోరారు.

ఎమ్మెల్సీగా గెలిపిస్తే శాసనమండలిలో ఉపాధ్యాయ వాణి వినిపిస్తా!


ఎన్నికల ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి గోపీమూర్తి

ప్రజాశక్తి- విఆర్ పురం: తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే శాసనమండలిలో ఉపాధ్యాయ వాణిని వినిపించి, విద్యా, ఉపాధ్యాయసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉభయ గోదావరి జిల్లాల పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.గోపీమూర్తి అన్నారు. గురువార మండలంలోని ఎహెచ్ఎస్, సోములగూడెం, సున్నాంవారిగూడెం, రేఖపల్లి కెజిబివి, విఆర్ పురం పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి, మొదటి ప్రాధాన్యత ఓటు తనకు వేసి గెలిపించాలని కోరారు.


ఈసందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి, సాబ్జి ఆశయసాధనకు తన 12ఏళ్ల సర్వీస్‌ను వదిలి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా శాసన మండలిలోఉపాధ్యాయులు వాయిస్‌ను వినిపించడానికి పోటీ చేస్తున్నానన్నారు. తాను స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూ, ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యల పోరాటాల్లో పాల్గొన్నానన్నారు. అప్రెంటీస్ విధానం, సిపిఎస్ రద్దు పోరాటాల్లో పాల్గొని జైలుకెళ్లానన్నారు. ఆదే ఉద్యమ స్ఫూర్తితో తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉపాధ్యాయులకు అండగా ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యు విల్సన్ బాబు, జిల్లా కార్యదర్శి పి. కృష్ణయ్య, ఎస్ నాగేశ్వరరావు, మండల కమిటీ అధ్యక్షులు కె వెంకట్. కార్యదర్శి యన్ జగదీష్, టి.అర్జున్, మంగరావు రెడ్డి, రామకృష్ణ, రాజు, బాబు పాల్గొన్నారు.

కూనవరం : ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొర్రా గోపీమూర్తి గురువారం మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కూనవరం జెడ్‌పిహెచ్ఎస్, కోతులగుట్టలోని కస్తూరిబా గాంధీ విద్యాలయ ఉపాధ్యాయులను మొదటి ప్రాధాన్యత ఓటు తనకు వేసి గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయులకు, ప్రభుత్వానికి వారిధిగా ఉండి సమస్యలు ఎప్పటి కప్పుడు పరిష్కారమయ్యేలా కృషి చేస్తానన్నారు. అనంతరం మర్రిగుండెం ఉన్నత పాఠశాల, నర్సింగపేట ఆశ్రమ బాలికల పాఠశాలలను సందర్శించి ప్రచారం చేశారు. కార్యక్రమంలో అల్లూరి జిల్లా అధ్యక్షులు వై.విల్సన్ బాబు, జిల్లా కార్యదర్శులు,పండా.కృష్ణయ్య, నాగేశ్వరరావు, డివివి సత్యనారాయణ, చారి కన్నారావు, నాగేశ్వరరావు, రాంబాబు, బాబు, సుబ్బారావు పాల్గొన్నారు.

కాఫీ పళ్ల సేకరణలో లక్ష్యాలు సాధించండి

ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు: కాఫీ పళ్ల సేకరణకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఐటిడిఏ పిఒ వి.అభిషేక్ ఆదేశించారు. కాఫీ ఎఇఒలు, ఫీల్డు కన్సల్టెంట్లు, హార్టీ కల్చర్ కన్సల్టెంట్లు, చింతపల్లి మాక్స్ సొసైటీ ప్రెసిడెంట్, బోర్డు డైరెక్టర్లతో గురువారం ఐటిడిఏ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐటిడిఏ పరిధిలోని 11 మండలాల నుండి రెండు వేల టన్నులకు తగ్గకుండా కాఫీ పళ్లను సేకరించాలని స్పష్టం చేసారు. 350 టన్నుల పార్చ్‌మెంటును ఉత్పత్తి చేయాలని పేర్కొన్నారు. మాక్స్ సంస్థ బోర్డు డైరెక్టర్ల సంఖ్యను పెంచి 11 మండలాలకు విస్తరించామని చెప్పారు. అన్ని మండలాల రైతులకు భాగ స్వామ్యం కల్పించామన్నారు. కాఫీ సేకరణలో బోర్డు డైరెక్టర్లు కీలక పాత్ర పోషించాలని సూచించారు. కాఫీ పళ్ల రవాణా వాహనాలకు మండలాలు, దూరాన్ని దృష్టిలో పెట్టుకు రవాణా చార్జీలను నిర్దేశించారు. మండల కేంద్రాల నుండి వాహనాలు అద్దెకు తీసుకోవాలన్నారు. ఆ మేరకు వాహనాలకు రవాణా చార్జీలు చెల్లిస్తామన్నారు. గత ఏడాది కిలో కాఫీ పళ్లుకు ముందుగా రూ.43 రెతులకు చెల్లించిన ఆనంతరం మూడు రూపాయల బోనస్ చెల్లించామన్నారు. ఈ ఏడాది రూ.44 ధరను రైతులకు చెల్లించడానికి నిర్ణయించడం జరిగిందన్నారు. 60 శాతం పళ్ల సేకరణ డిసెంబరు నాటికి పూర్తి చేయాలని చెప్పారు. పాత తోటల కాఫీ పునరుద్ధరణకు 400 మొక్కలు ఉన్న తోటలను గుర్తించాలన్నారు. కాఫీ మొక్కల పునరుద్ధరణ చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి . వేంకటేశ్వరరావు, కాఫీ సహాయ సంచాలకులు ఎన్. అశోక్, మాక్స్ సంస్థ అధ్యక్షులు సెగ్గి కొండలరావు, వైస్ ప్రెసిడెంట్ సింహాచలం, కాఫీ ఎఇఒలు, ఫీల్డు కన్సల్టెంట్లు, హార్టీ కల్చర్ కన్సల్టెంట్లు, చింతపల్లి మాక్స్ సొసైటీ ప్రెసిడెంట్, బోర్డు డైరెక్టర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పిఒ అభిషేక్



మాట్లాడుతున్న శాంత కుమారి

జిఒ నెంబర్ 3పై అసెంబ్లీలో చర్చించాలి

-కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంత కుమారి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: జీవో 3పై ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చ జరపాలని ఏపీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి శాంతకుమారి డిమాండ్ చేశారు. మండలంలోని అరకు గ్రామంలో గురువారం సందర్శించిన ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ శాఖల్లో గిరిజనులకు వంద శాతం ఉద్యోగాలు కల్పించేందుకుగాను గతంలో జీవో 3ను తీసుకొచ్చారన్నారు. ప్రస్తుతం ఆ జీవో రద్దు చేయడంతో గిరిజనులు ఉద్యోగాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు అరుకులో పర్యటించిన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జీవో నెంబర్ 3ను పునరుద్ధరిస్తానని బహిరంగంగా హామీ ఇచ్చారని, ఇప్పటికి ఆరు నెలల గడుస్తున్నా దానిపై చర్చ జరపక పోవడం విచారకరమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సిహెచ్ సాయిబాబా, ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ సోమేశ్వరరావు, రాష్ట్ర నాయకుడు చిన్నస్వామి, కార్యకర్తలు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం


బాధితులకు ఆర్థిక సాయం చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -కూనవరం : రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, భాస్కర్ దంపతులు ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలంలోని చూచిరేవులగూడెం గ్రామంలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయుడైన తెల్లం ముత్తయ్య కుటుంబాన్ని పరామర్శించి, తమ సొంత నిధులు రూ.పదివేలు ఆర్థికసాయం చేశారు. బాధితులకు ఇళ్ళు కట్టించే బాధ్యత తీసుకుంటానని, అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. సర్పంచ్ తెల్లం నిరోష, గడ్డిపాటి ప్రసాద్, నోముల సత్యనారాయణ, గడేసుల రంజిత్ కుమార్, సాయిలి రాజేష్, నలజాల శ్రీకాంత్, చింతం సాయి కిరణ్, దగ్గుబల్లి వినోద్, శ్రీను, సురేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.


శంకుస్థాపన చేపడుతున్న ఎంపిపి

తాగునీటి పథకానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని బాకూరు పంచాయితీ గొప్పులపాలెం గ్రామానికి మండల పరిషత్ 15 వ ఆర్థిక సంఘం నిధులతో తాగునీటి పైప్ లైన్ పథకానికి ఎంపీపీ కూడా రాజుబాబు ఎంపిటీసీ నైని రజని, సర్పంచ్ బాకూరు వెంకట రమణ రాజులతో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎంపిటీసీ నిధులను తాగునీటి సమస్య పరిస్కారానికి వెచ్చిస్తున్నట్లు ఆయన తెలిపారు . ఈ కార్యక్రమంలో హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, తడిగిరి వైస్ సర్పంచ్ కిల్లో రామారావు, వార్డ్ మెంబర్ మజ్జి రాజారావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-ముంచింగి పుట్టు: మండలంలోని కించాయిపుట్టు పంచాయతి పరిధిలో బరడ పిఆర్ రోడ్ నుండి తేనెల మామిడి గ్రామం వరకు రోడ్డు నిర్మాణనికి నిధులు కేటాయించాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎం.ఎం శ్రీను డిమాండ్ చేశారు. గురువారం రోడ్డు పరిశీలనకు వెళ్లిన అధికారులకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో అనేక దపాలుగా పాడేరు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, పంచాయతీరాజ్ శాఖ అధికారులకు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయగా ఎట్టకేలకు స్పందించి రోడ్డు పరిశీలనకు అధికారులు వచ్చారని తెలిపారు. మండల పంచాయతి రాజ్ శాఖ అధికారి మురళీ కృష్ణ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణనికి నిధుల ప్రణళికా తయారుచేసి ప్రభుత్వం దృష్టికి పంపుతామని తెలిపారు.


దరఖాస్తులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి -అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ఉచిత ఆధార్ సేవలు జరుతున్నాయని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ ఏవివి.కుమార్ కోరారు. గురువారం మండలంలోని నరసింహరాజపురం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా సమీప బ్యాంకు, లేదా పోస్ట్ ఆఫీస్ వద్ద ఎన్పీసిఐ లింకు చేయించుకోవాలని, లేని పక్షంలో వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించవన్నారు. అదేవిధంగా హౌస్ హెూల్డ్ జియో టాగింగ్ సర్వే కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

● జెన్‌కో ఎస్ఇకి యునైటెడ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ వినతి


ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘ నేతలు

ప్రజాశక్తి -సీలేరు: ఎపి జెన్‌కో, ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి, రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, సిఐటియు బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు బి.లక్ష్మణ్, విష్ణుకుమార్, గౌరవాధ్యక్షులు ఎస్‌కె.సుభాన్ డిమాండ్ చేశారు. గురువారం యూనియన్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఎపి జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ ఇన్‌ఛార్జి ఎస్ఇ (సివిల్) చంద్రశేఖర్ రెడ్డిని కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.

విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న కార్మికులనుతక్షణమే రెగ్యులరైజ్ చేసి, 2022 పిఆర్‌సి ప్రకారం వేతనాలు, ఎరియర్స్ వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పదేళ్ల పూర్తయిన ప్రతి కార్మికుడికీ 2018కి ముందు ఇచ్చిన విధంగా హైస్కిల్డ్ రూ.1000, స్కిల్డ్ రూ.800, అన్ స్కిల్డ్ కు రూ 500 చొప్పున ఇన్సెంటివ్ పెంచేలా జెన్‌కో యాజమాన్యం చర్యలు చేపట్టాలన్నారు. సీలేరు, డొంకరాయి జల విద్యుత్ కేంద్రాల్లో పనిచేస్తున్న 85 మంది విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు ఎపి జెన్‌కో ఆధ్వర్యంలో నడుస్తున్న భవ్య హాస్పిటల్‌లో తక్షణమే వైద్యసేవలు కల్పించాలని కోరారు. సీలేరు ప్రాంతంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు మలేరియా, టైఫాయిడ్, డెంగీ, భయంకరమైన విషజ్వరాల బారిన పడి ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ఎపి జెన్‌కో యాజమాన్యం నమ్ముకుని పనిచేస్తున్న 100 మంది కార్మికులకు, వారి కుటుంబాలకు అత్యవసర సమయంలో వైద్యం అందడం లేదన్నారు. దీంతో చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న వారంతా తమ జీతం డబ్బులను వైద్యుఖర్చులకు వినియోగించాల్సి వస్తోందని వాపోయారు.

. కాంట్రాక్ట్ కార్మికుల సర్వీసు ప్రాతిపదికంగా అన్ స్కిల్డ్ నుంచి సెమీ స్కిల్డ్, హైస్కిల్‌గా ప్రమోషన్ కల్పించాలని అధికారులకు కోరారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు రిటైర్మెంట్ బెనిఫిట్, గ్రాట్యూటీ రూ.10 లక్షలు మంజూరు చేయాలని, ఎపి జెన్‌కో ఉద్యోగులకు కేటాయించగాపోను మిగిలిన క్వార్టర్స్‌ను అద్దె ప్రాతిపదికన కాంట్రాక్ట్ కార్మికుల కేటాయించాలని కోరారు. ఎపి జెన్‌కో, ట్రాన్స్‌కో కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, ఒకే క్యాడర్ ఒకే విధానాన్ని అమలు చేయాలన్నారు. సీలేరు కాంప్లెక్స్ పరిధిలో పనిచేస్తున్న హెయ్యర్ వెహికల్ డ్రైవర్స్‌కు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సక్రమంగా సంబంధిత కాంట్రాక్టర్ కట్టేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సీలేరు ఎపి జెన్‌కో కాలనీలో వ్యర్థాలను డంపింగ్ చేసే ఆరుగురు కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతి నెలా ఆరు రోజులు కాకుండా, వచ్చే ఏడాది నుంచి నెలకు 26 పని దినాలు కల్పించేలా చర్యలు చేపట్టి కనీస వేతనం చెల్లించాలని కోరారు. ఎపి జెన్‌కో మాచ్‌ఖండ్, ఒనకఢిల్లీ, కొరాపుట్‌లో వాటర్ ట్రీట్‌మెంట్, పెస్ట్ కంట్రోల్, ఫాగింగు, స్ప్రేయింగ్ సర్వీస్‌లో 2005 నుంచి 2024 వరకు 19 ఏళ్లుగా 9 మంది విద్యుత్తు కాంట్రాక్ట్ కార్మికులు అన స్కిల్డ్ ఎస్ఎస్ఆర్ రేటు ప్రకారం జెన్‌కో అధికారులు ఎస్టిమేట్ వేసి పంపిస్తున్నారని, ఈ విధానాన్ని రద్దుచేసి, వచ్చే సంవత్సరానికి అంచనాల్లో వారికి కనీస వేతనం పొందుపరిచి, వారిని మాన్‌పవర్‌గా మార్చేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. డిమాండ్ల నెరవేర్చడంలో ఎపి జెన్‌కో యాజమాన్యం, అధికారులు కాలయాపన చేయకుండా చర్యలు చేపట్టాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు కన్వీనర్ ఎంవి. రమణ కాంట్రాక్ట్ కార్మిక సంఘ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఎస్. రమణ, ఎస్‌కె.అబీబుల్లా, జి .లక్ష్మణరావు, బత్తుల మేజబ్, సిహెచ్.పైడిరాజు, కె.రవి పాల్గొన్నారు.

'కిశోరి వికాసం'పై జిల్లాస్థాయి శిక్షణ



మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సింహాచలం

ప్రజాశక్తి- రంపచోడవరం : ఏజెన్సీలో 18ఏళ్లలోపు బాలికలు మంచిమార్గంలో నడిచే విధంగా అవగాహన కల్పించే బాధ్యత అందరిపై ఉందని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం అన్నారు. గురువారం స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో ఐసిడిఎస్, విద్యాశాఖ, వెలుగు, వైద్యఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో కిశోరి వికాసం జిల్లాస్థాయి శిక్షకులతో మండలస్థాయి శిక్షణ అవగాహన కల్పించారు. రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పిఒ కట్టా సింహాచలం మాట్లాడుతూ 18ఏళ్లలోపు కిశోరి బాలికలకు చదువుపై దృష్టిపెట్టేలా అవగాహన కల్పించాలన్నారు. బాల్యవివాహాలు అనర్థాలు, పౌష్టికాహారంపై బాలికలకు తెలియజేయాలన్నారు. ఏజెన్సీలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే దగ్గర్లో ఉన్న ఐసిడిఎస్ అధికారులు, పోలీసులకు సమాచారమిచ్చి నిరోధించే చర్యలు చేపట్టాలన్నారు.

రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ మాట్లాడుతూ ఏజెన్సీలోని 18 సంవత్సరాల లోపు వయసు గల బాలికలకు విద్యాశాఖ, పంచాయతీరాజ్ శాఖ, వెలుగు, ఐసిడిఎస్, మెడికల్ అండ్ హెల్త్ శాఖలు పాఠశాలలలో, జూనియర్ కాలేజీలలో, డిగ్రీ కాలేజీలలో చదువుచున్న బాలికలకు చదువుపై దష్టి పెట్టే విధంగా అందరం కలిసి అవగాహన కల్పించాలని సూచించారు. డిగ్రీ పూర్తయిన తర్వాత పెళ్లిళ్లు చేసుకోవాలని, అపుడే వారికి ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఉండవన్నారు. బాల్యవివాహాలను ప్రోత్సహించిన వారు, పెళ్లిళ్లలో పాల్గొన్నవారు శిక్షార్హులౌతారని హెచ్చరించారు. రంపచోడవరం, చింతూరు డివిజన్లో కిశోరి వికాసంపై 18ఏళ్ల లోపు బాలికలకు గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. లీగల్ సెల్ ప్రొబేషనల్ అధికారి యస్. అశోక్, జిల్లా బాలల సంరక్షణ అధికారి టి.సద్దు, రంపచోడవరం, చింతూరు డివిజన్లకు సంబంధిత మండల స్థాయి అధికారులకు, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శిక్షణనిచ్చారు. శిక్షణ పొందిన మండల స్థాయి అధికారులు గ్రామస్థాయిలో బాలికలకు అవగాహన కల్పించాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యలక్ష్మి, ఎడిఎంహెచ్ఒ జి.శిరీష, వెలుగు ఎపిడి యస్. డేగలయ్య, సిడిపిఒలు సంధ్యారాణి, లక్ష్మీ, విజయగౌరీ, మణెమ్మ, వెలుగు డిపిఎం అపర్ణ, అడ్డతీగల జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ స్వామి పాల్గొన్నారు.

పర్యాటక బోట్లలో మద్యం నిషేధం

● విస్తృత తనిఖీలు చేస్తున్న పోలీసులు, అధికారులు

ప్రజాశక్తి- దేవీపట్నం : పాపికొండల విహారయాత్రకు వెళ్లే పర్యాటకులు మద్యాన్ని బోట్లలో తీసుకెళ్లడం నిషేధమని అధికారులు హెచ్చరించారు. గోదావరి నదిలో బోట్లపై ప్రయాణం చేస్తూ, ప్రకృతి అందాలను తిలకించాలని, మద్యాన్ని బోట్లతో తీసుకెళ్లడం, తాగడం పూర్తిగా నిషేధమని సూచించారు. దేవీపట్నం మండలం నుంచి పాపికొండల విహారయాత్రకు ప్రతిరోజూ పర్యాటకులతో బోట్లు గోదావరి నదిలో ప్రయాణిస్తున్నాయి. రెండు రోజుల క్రితం పాపికొండలకు వెళుతున్న పర్యాటకులు నుంచి పోలీసులు మద్యం బాటిల్స్ స్వాధీనపరుచుకున్నారు. పోలీసులకు మద్యం బాటిల్స్ దొరకడంతో అన్ని శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. పర్యాటక బోట్లపై మద్యం తాగి, ఆ మత్తులో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, దీంతో విహారయాత్రకు వచ్చిన ఇతర పర్యాటకులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. అంతేకాక మద్యం మత్తులో వివాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో పర్యాటక బోట్లలో మద్యాన్ని నిషేధిస్తూ నిర్ణయం తీసుకోవడంతోపాటు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, బోట్లు ఎక్కే సమయంలో పర్యాటకులను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. వారు తీసుకువచ్చే బ్యాగులు, ఇతర సామాగ్రి పరిశీస్తునఆనరు. పాపికొండలు విహారయాత్రకి వెళ్లే పర్యాటకులు మద్యం తీసుకెళ్లకూడదని, ఎవరైనా తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిచారు. పోలీసుల పటిష్టనిఘా ఉంటుందని, అతిక్రమిస్తే కఠినచర్యలు ఉంటాయన్నారు. పర్యాటకులు అందరూ సహకరించాలని పోలీసులు కోరారు. తద్వారా ప్రశాంతమైన వాతావరణంలో, గోదావరి నదిలో ప్రయాణిస్తూ, పాపికొండల విహారయాత్రను ఆనందమయం చేసుకోవాలని సూచించారు.


పాపికొండల విహారయాత్రకు వెళ్లే బోట్లు


ఎంపిడిఒను సన్మానిస్తున్న టిడిపి నేతలు

ఎంపిడిఒకు సత్కారం

ప్రజాశక్తి-చింతపల్లి:మండల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేయాలని చింతపల్లి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు ను తెదేపా మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు కోరారు. గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావుకు పుష్పగుచ్చం అందించి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, వైకాపా ప్రభుత్వంలో మండలంలో ఎన్నో సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయని, వాటిని పరిష్కారం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అందరి సహకారంతో మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీడీవోను కలిసిన వారిలో తెదేపా సీనియర్ నాయకులు చల్లంగి లక్ష్మణరావు, దేపూరు వెంగళయ్య, గంగరాజు, మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, అరకు పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నాగభూషణం, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆనందరావు, మైనార్టీ విభాగం నాయకుడు షేక్ కాసిం వలి ఉన్నారు.


మాట్లాడుతున్న సర్పంచ్ మొస్య

సచివాలయంలో గ్రామసభ

ప్రజాశక్తి -అనంతగిరి:గ్రామ సభల ఏర్పాటుతో పలు సమస్యలను గుర్తించడం సాధ్యపడుంతుదని సీపీఎం టోకురు సర్పంచ్ కిల్లో. మొస్య అన్నారు గురువారం టోకూరు పంచాయతీ గ్రామ సచివాలయంలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. వివిధ ప్రభుత్వ పథకాల పై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ పథకాలు కొన్ని సాంకేతిక కారణాలతో అందని వాటిని నేచర్ సంస్థ బృందం గుర్తించి అధికారుల దష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నారన్నారు.

నేచర్ సంస్థ ఆర్డీనెటర్. గౌరి పట్నాయక్ మాట్లాడుతూ, నేచర్ యూత్ ప్రతినిధులు ప్రతి గ్రామంలో ఉన్నారని, పథకాలు అందని వారిని గుర్తించి లబ్ధిదారులకు అందే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి. లావణ్య, నేచర్ సంస్థ యూత్ మోబ్లైజర్ కిల్లో. రాంబాబు, చందర్రావు, ప్రసాద్ పాల్గొన్నారు

విద్యుత్ స్తంభం పునరుద్దరణ

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రంలో జీప్ స్టాండ్ వద్ద కరెంటు స్తంభం రోడ్డును అనుకోని ఇంటి మీదకు పక్కకు వంగిపోయింది. వర్షం, పెద్ద గాలులు వచ్చినప్పుడు స్తంభం పడిపోయే ప్రమాదం జరగడానికి ఆస్కారం ఉందని స్థానిక తెలుగుదేశం పార్టీ పంచాయతీ అధ్యక్షులు కెవి ప్రసాద్, యూనిట్ ఇంచార్జ్ మత్స్య నారాయణరాజు సమాచారం తెలియజేయడంతో జి. మాడుగుల విద్యుత్ శాఖ ఏఈ రమణ వెంటనే స్పందించి స్తంభాన్ని సరి చేశారు.

గిరిజన యువతకు హస్తకళలో శిక్షణ

ప్రజాశక్తి -పాడేరు:జిల్లాలోని పర్యాటక ప్రాంతా లను మరింత అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. జిల్లాలో డెస్టినేషన్ అభివృద్ధి అథారిటీని ఏర్పాటు చేసామన్నారు. గిరిజన యువతకు హస్తకళలో శిక్షణ అందించడానికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని పర్యాటక అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ పి.ఓలు, సబ్‌కలెక్టర్లు, పర్యాటక అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యాటక కేంద్రాలలో ప్లాస్టిక్ నిషేదం, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని ఐటిడిఏ పి.ఓలకు సూచించారు. వారపు సంతల్లో ప్లాస్టిక్ నిషేదానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేసారు. అరకు వ్యాలీ, మారేడుమిల్లి పర్యాటక కేంద్రాలలో పర్యాటక ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. గిరిజన యువతీ యువకులకు, టూరిజం, ఆతిధ్య రంగాలలో తగిన శిక్షణ అందించడానికి ప్రతిపాదించాలని చెప్పారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలపై షార్ట్ ఫిలిం తయారు చేసి సామాజిక మాధ్యమాలలో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న వారపు సంతలపై సమగ్రమైన సర్వే చేసి నివేధించాలన్నారు. వారపు సంతల్లో స్వయం సహాయక సంఘాలతో దుకాణాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వారపు సంతల్లో నకిలీ వస్తువులు, ఆహార పదార్ధాలు విక్రయించ కుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేసారు. హెూటల్స్ లేని పర్యాటక ప్రాంతాలలో పర్యాటకులు బస చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రముఖ పర్యాటక కేంద్రాలలో సాహస క్రీడలను ఏర్పాటు చేయాలని, ముందుగా గ్రామ సభల ఆమోదం తీసుకుని వచ్చిన ఆదాయంలో కొంత భాగం సంబంధిత పంచాయతీలకు కేటాయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, పర్చువల్గా ఐటిడిఏ పిఓలు వి.అభిషేక్, కె.సింహాచలం, అపూర్వ భరత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా పర్యాటక అధికారి జి.దాసు, అరకు మ్యూజియం మేనేజర్ మురళికృష్ణ, టూరిజం కన్సల్టెంట్ రత్నరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రూ .69 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు


పనులను పర్యవేక్షిస్తున్న ఇఇ బాలసుందబాబు

ప్రధాన ఆర్ అండ్ బి రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ప్రజా రవాణా మెరుగుపడనుంది.

జిల్లాలోని స్టేట్ హైవేస్‌గా ఉన్న 19 రోడ్లు అభివృద్ధికి ప్రభుత్వం 45 కోట్ల 67 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో రంపచోడవరం పాడేరు డివిజన్‌లోని రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. జిల్లాలోని మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు అభివృద్ధికి 20 కోట్ల 65 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో చింతూరు, వీఆర్ పురం రోడ్డు నెల్లిపాక పోచవరం రోడ్డు అభివృద్ధి చేయనున్నారు.జిల్లాలోని 22 మండలాల్లో రోడ్ల మరమ్మతుల కోసం ప్రభుత్వం రెండు కోట్ల 40 లక్షలు మంజూరు చేసింది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఈ రోడ్ల మరమ్మత్తు పనులు జోరుగా సాగుతున్నాయి...

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా వ్యాప్తంగా పాడేరు, రంప చోడవరం డివిజన్లలోని 22 మండలాల్లో రహదారుల మరమ్మతులతో పాటు జిల్లాలోని పలుచోట్ల స్టేట్ హైవే రోడ్లు జిల్లా రోడ్లు అభివృద్ధికి ఆర్ అండ్ బి యంత్రాంగం శ్రీకారం చుట్టింది. జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ చొరవతో ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి బాల సుందర బాబు పర్యవేక్షణలో ఇప్పటికే జిల్లాలో రహదారుల మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి.

జిల్లాలో ప్రధాన మైన ఆర్ అండ్ బి రహదారుల అభివృద్ధి జరుగుతుండటంతో జిల్లాలోని పలు మార్గాల్లో ప్రజలకు రవాణా సేవలు విస్తరించనున్నాయి. పాడేరు జిల్లా కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లా కేంద్రం నుంచి రంపచోడవరం డివిజన్‌లోని పలు ప్రాంతాలకు రోడ్డు మార్గం సుదూరం కావడం రహదారులు అభివృద్ధి జరగక రవాణా సేవలు అందుబాటులో లేని పరిస్థితి ఉంది. జిల్లాలోని

జిల్లా కేంద్రంలో రూ,46 కోట్లతో ప్రతిపాదన

అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు టౌన్‌లో రోడ్ల అభివద్ధికి రూ, 46 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదన చేసాం. ప్రభుత్వం ఆమోదించి నిధులు మంజూరు చేసిన తర్వాత పాడేరు టౌన్‌లో రోడ్డు కిరువైపులా ఫుట్ పాత్‌లు, కాలువల నిర్మాణం మెయిన్ రోడ్లలో 24 అడుగుల రోడ్ల విస్తరణ పనులు చేపట్టనున్నాం. ప్రస్తుతం పాడేరు మెయిన్ రోడ్‌లోని సుంద్రుపుట్ పెట్రోల్ బంక్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు కోటి రూపాయలతో తారు రోడ్డు పనులు నిర్వహిస్తాం. ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద 30 లక్షలతో ప్రధాన రహదారిని అభివృద్ధి చేస్తున్నాం. పాడేరు నియోజకవర్గంలోని సీలేరు ప్రధాన రహదారి అభివృద్ధికి 16 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే ప్రధాన రహదారుల్లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం.

పి బాల సుందర బాబు,
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,
రహదారులు భవనముల శాఖ, పాడేరు

నేరాలు ఘోరాలు

బెల్లం క్రషర్‌లో చీర ఇరుక్కుని మహిళ మృతి

ప్రజాశక్తి- కోటవురట్ల:మాకవరపాలెం మండలంలో జంగాలపల్లి గ్రామ రెవిన్యూ పరిధి బెల్లం తయారీ క్రషర్‌లో చీర ఇరుక్కుని కోటవురట్ల మండలం రాజుపేట గ్రామానికి చెందిన శరకం పద్మ (45) గురువారం మృతి చెందింది. చెరుకు బెల్లం పరిశ్రమ వద్ద పని చేస్తున్న ఆమె చెరుకును మిషన్ బెల్టుకు అందిస్తున్న సమయంలో ఆమె చీర కొంగు బెల్టులో చిక్కుకు పోవడంతో మెడకు బిగుసుకొని మృతి చెందినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.ఆమె భర్త సత్తిబాబు పది సంవత్సరాల క్రితం చనిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఇదే క్రషర్ లో ఆమె మూడు సంవత్సరాలుగా పనిచేస్తూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటూ జీవనం సాగిస్తుంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి పోలీసులు తరలించారు.

8 మంది జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ బస్టాప్ వెనుక ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్న 8 మందిని స్థానిక పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక బీచ్ బస్టాప్ వెనుక ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిఐ బొడ్డేపల్లి సుధాకర్ ఆధ్వర్యాన సిబ్బంది ఆకస్మికంగా దాడి చేశారు. 8 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1610 స్వాధీనం చేసుకున్నారు. సిఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తొమ్మిది చోరీల్లో ముగ్గురు అరెస్టు

21.30 లక్షల నగదు, 188 గ్రాముల బంగారం స్వాధీనం

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో ఎలమంచిలి, అచ్యుతాపురం పరవాడ పోలీస్ స్టేషన్లో పరిధిలో 9 చోరీల్లో రూ.21లక్షల నగదు, 188 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పి తుహిన్ సిన్హా వెల్లడించారు. గురువారం స్థానిక పోలీసు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎలమంచిలి పోలీసులు నాలుగు కేసుల్లో రూ.11.30లక్షలు విలువ గల 45 గ్రాముల బంగారు హారం, 4 ద్విచక్ర వాహనాలు, ఒక మొబైల్ ఫోన్ ను స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులు అరెస్ట్ చేశామన్నారు. అలాగే అచ్యుతాపురం,పరవాడ పోలీస్ స్టేషన్ల పరిధిలో 5 చోరీ కేసుల్లో సుమారు రూ.10 లక్షల విలువగల 143 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసామన్నారు. ఈ సందర్భంగా పరవాడ అచ్యుతాపురం సిఐలు ఆర్.మల్లికార్జున రావు, ఎన్.గణేష్, సిసిఎస్ సిఐ కె.అప్పలనాయుడు ఎలమంచిలి రూరల్ ఎస్సై ఎం.ఉపేంద్ర, సీసీఎస్ సిబ్బందిని, క్లూస్ టీం, ఐటీ కోర్ సిబ్బందిని జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా, పరవాడ డిఎస్పి కె.వి.సత్యనారాయణ, అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. మీడియా సమావేశంలో ఎఎస్పి క్రైమ్స్ ఎల్.మోహన్ రావు, ఎలమంచిలి సిఐ ఎస్.ధనుంజయరావు, సిసిఎస్ ఎస్ఐలు పి.రమేష్, ఎన్.సత్యనారాయణ, కుమార్, హెచ్.సీ అప్పలరాజు ఎలమంచిలి రూరల్, అచ్యుతాపురం ఎస్ఐలు ఎం.ఉపేంద్ర, అచ్యుతాపురం ఎస్సై కె.సుధాకర్ రావు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దైవ సేవకులు

క్రిస్మస్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-హుకుంపేట:డిసెంబర్ 6న జరిగే ఐక్య క్రిస్మస్ పండుగలు విజయవంతం చేయాలని ఫెలోషిప్ మండల అధ్యక్ష కార్యదర్శులు కె.బి.సుధాకర్, కొర్రా. ప్రేమ కుమార్ పేర్కొన్నారు. మండలలోని గురువారం పోస్టర్లు ఆవిష్కరించారు. అంతరం వారు మాట్లాడుతూ,మండల కేంద్రంలో ఉన్న పాస్టర్స్, సంఘ సభ్యులు అందరు పాల్గొని విజయవంతంగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ మాజీ ప్రెసిడెంట్ వి.మోజెస్, పాస్టర్లు. సముయేలు, కొర్రా రఘు తదితరులు పాల్గొన్నారు.


సిఐటియులో చేరిన ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు

సిఐటియులోకి ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం ఏరియా ఆసుపత్రి శానిటేషన్ వర్కర్లు సిఐటియులో చేశారు. గురువారం రంపచోడవరం సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సిఐటియు అనుబంధంగా ఉన్న ఆసుపత్రి శానిటేషన్ వర్కర్స్ యూనియన్‌లో చేరారు. వారిని యూనియన్‌లోకి ఆహ్వానించిన సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల, వాణిశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతిరాజు మాట్లాడుతూ హాస్పటల్ శానిటేషన్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు, ప్రమాద బీమా సౌకర్యం, ఉద్యోగ భద్రత, కల్పించాలని, ఇఎస్ఐ, పి.ఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలపై నిరంతరం పోరాడుతూ కార్మికులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు.

వణికిస్తున్న చలిపులి

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు పరిసర ప్రాంతాల్లో చలి తీవ్రత అధికమైంది. రెండు రోజుల నుంచి మంచు విస్తీరంగా కురుస్తుండడంతోపాటు పగటిపూట ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో చలిలో మన్యవానులు ఉక్కిరిబిక్కిరౌతున్నారు చలి తీవ్రత అధికంగా ఉండడంతో మార్నింగ్‌వాక్‌కు వెళ్లేవారంతా ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు మూడు నెలల క్రితం భారీ వర్షాలు, తుఫానులు, ఆ తర్వాత అధిక ఉష్ణోగ్రతలు ఇలా వాతావరణ మార్పులు ప్రజలను ఇబ్బందులకు గురిచేయగా, ఇపుడు చలిపులి ఏజెన్సీ వాసులకు చంపేస్తోందనే చెప్పాలి. చలి తీవ్రత అధికంగా వృద్ధులు, చిన్నారులు ఆస్మా వ్యాధిగ్రస్తులు చలికి తాళలేక వాళ్ళు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో చలి ప్రభావం తీవ్రతరమైంది. సాయంత్రం మూడు గంటలు నుంచి వాతావరణం క్రమేపిగా మార్పు చెంది చలిగాలులు వీస్తూ క్రమేపి సూర్యాస్తమయం సమయానికి చలి ఉఉక్కిరిబిక్కిరిచేస్తోంది. మున్ముందు చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనాల నేపథ్యంలో మన్యం ప్రజలు భీతిల్లుతున్నారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు మారుమూల గ్రామాల్లో గిరిజన రైతులు సూర్యోదయం కాకముందే పంట పొలాల్లోకి వెళ్లి పొలం పనులు నిర్వహించడం పరిపాటి. ఇపుడు చలి తీవ్రత అధికంగా ఉండడంతో ఏడుగంటలు దాటిన తర్వాతగానీ పొలాలకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. మంచు అధికంగా వరి కోతలకు ఇబ్బందులున్నాయని అంటున్నారు.

బాదంగీర్ సాయి కన్నుమూత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రముఖ నాటక రచయిత, రంగసాయి నాటక సంఘం, రంగసాయి నాటక గ్రంథాలయం వ్యవస్థాపకులు ఎవివిఎస్.మూర్తి (బాదంగీర్ సాయి) గురువారం సాయంత్రం ఆరు గంటల సమయంలో తుది శ్వాస విడిచారు. విశాఖలో ఉంటున్న ఆయన కొంతకాలంగా బ్రెయిన్ హ్యామెరెజ్ సమస్యలతో బాధపడుతున్నారు. గురువారం సాయంత్రం ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మురళీనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. నాటక కళాకారుడైన బాదంగీర్ సాయి నటనతో సరిపెట్టుకోకుండా నాటక వికాసానికి కూడా తన వంతు కృషి చేసేందుకు నిరంతరం తపిస్తూ నాటక ప్రదర్శనలకు శ్రీకారం చుట్టారు. దేశ, విదేశాల్లో ప్రసిద్ధిగాంచిన సురభి నాటకాలను విశాఖలో 40 రోజులపాటు ప్రదర్శింపజేశారు. అదే విధంగా విశిష్ట ప్రేక్షకాదరణ పొందిన అనేక నాటకాలను విశాఖ నగరంలో ప్రదర్శింపజేస్తూ 2010లో ఏర్పాటు చేసిన రంగసాయి నాటక సంఘం ద్వారా విశేష కృషి చేశారు. మరుగునపడిన కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేయడంతో పాటు వారిని ఘనంగా సత్కరించే కార్యక్రమాలను తెలుగు నాటక రంగ దినోత్సవం, ప్రపంచ నాటక రంగ దినోత్సవం సందర్భంగా ఏటా నిర్వహిస్తూ వచ్చారు. సాయి మరణం తీవ్ర విచారకరమని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ పేర్కొన్నారు.

విశాఖలో హై కోర్టు బెంచ్ ఏర్పాటు

- ప్రభుత్వాన్ని కోరిన పిడిఎఫ్ సభ్యులు కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హైకోర్టు బెంచ్‌ను కర్నూలులో ఏర్పాటు చేస్తూ శాసన మండలిలో పెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నామని, అదే సమయంలో ఉత్తరాంధ్ర ప్రాంతానికి మేలు చేసే విధంగా విశాఖలోను మరో బెంచ్ ఏర్పాటు చేయాలని పిడిఎఫ్ సభ్యులు కె.ఎస్ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని కోరారు. శానస మండలిలో న్యాయశాఖ మంత్రి ఎన్.ఎండి ఫరూక్ ప్రవేశపెట్టిన ఎపి ఉన్నత న్యాయస్థానం ధర్మాసనాన్ని హైకోర్టులో ఏర్పాటు చేయాలనే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో సభ్యులు కె.ఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ...పెద్ద రాష్ట్రాలలో రెండు బెంచ్‌లు ఏర్పాటు చేశారని తెలిపారు. విశాఖలో బెంచ్ ఏర్పాటు అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరారు. సభ్యులు వై.శివరామిరెడ్డి మాట్లాడుతూ సిబాగ్ ఒప్పందం ప్రకారం కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాల్సి ఉందని, బెంచ్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం చేతులు దులుపుకుంటుందని చెప్పారు. సభ్యులు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వం హై కోర్టును కర్నూలులో ఏర్పాటు చేస్తామంటే అడ్డుకున్నది టిడిపి నాయకులేనన్నారు. ఎం.వి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ... కర్నూలులో న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు 243 ఎకరాలు కేటాయించడం జరిగిందని, దీని నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ సందర్భంగా సభ్యులు రాంగోపాల్ రెడ్డి, నాయుడు, అరుణ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు.

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తామన్న ప్రభుత్వం గత ఐదేళ్ల కాలంలో వైసిపి ప్రభుత్వం కనీసం ప్రతిపాధనలు కూడా సమర్పించలేకపోయిందనివైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. ప్రతిపాధన లేకుండా హై కోర్టు దానంతట అదే తరలిపోతుందా అని ప్రశ్నించారు. ఇది కర్నూలు ప్రజలకు పండుగ వంటిదని మంత్రి టి.జి భరత్ తెలిపారు. సిబాగ్ ఒప్పందం ప్రకారం బెంచ్ ఏర్పాటు చేయడం చంద్రబాబుతో సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు రాయలసీమకు వైసిపి హయాంలో ఏం అభివృద్ధి చేశారని మంత్రి ప్రశ్నించారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం హై కోర్టు బెంచ్ కర్నూలులో ఏర్పాటు చేసేందుకు తీర్మానం చేసి తదుపరి చర్యల కోసం హై కోర్టుకును కోరుతున్నట్లు చెప్పారు. అక్కడ ఏర్పాటు చేసిన ఎపిఇఆర్సి, మనవ హక్కుల కమిషన్ కార్యాలయం, ఇతర కార్యాలయాలను తరలించేది లేదని మంత్రి స్పష్టం చేశారు. న్యాయశాఖ మంత్రి ఎన్.ఎండి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్ర తొలి రాజధాని కర్నూలుకు పూర్వవైభవం రానుందని, హై కోర్టు బెంచ్ ఏర్పాటు చేయడాన్ని సీమ ప్రజలు స్వాగతిస్తున్నారని చెప్పారు.

బివి.రామారావు సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : తెలుగు రాష్ట్రాలలో పేరుగాంచిన పారిశ్రామికవేత్త బలుసు వెంకట రామారావుకు పలువురు ఘన నివాళులు అర్పించారు. పాత వెంకోజీపాలెంలో ఆయన గృహంలో గురువారం సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు, ప్రముఖులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పారిశ్రామిక రంగానికి బివి.రామారావు చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని అభివర్ణించారు. మంచి పరిపాలనా దక్షత, దూరదృష్టి కలిగిన నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని అందరికంటే ముందు 1994లోనే బివి.రామారావు ఆకాంక్షించారన్నారు. పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా రామారావు ఉపాధి కల్పించారని కొనియాడారు. అంతకుముందు బివి.రామారావు చిత్రపటానికి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య వంటి ప్రముఖులు నివాళులు అర్పించారు. రామారావు సతీమణి సావిత్రి, కుమారుడు వెంకట రామ్, కోడలు రాధిక, మనవరాలు ధన్వి, కుమార్తె రామినేని వసంత లక్ష్మీ నివాళు లు అర్పించారు.


బివి.రామారావు చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

వాల్తేరు తాత్కాలిక డిఆర్‌ఎంగా మనోజ్ కుమార్ సాహూ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు డివిజన్ ఎడిఆర్‌ఎం మనోజ్ కుమార్ సాహూ ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ తాత్కాలిక డివిజనల్ రైల్వే మేనేజర్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. మనోజ్ కుమార్ సాహూ బుర్లాలోని వీర్ సురేంద్ర సాయి యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ నుంచి బిఇ/ఎలక్ట్రికల్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఉత్కల్ యూనివర్సిటీ నుంచి పిజిడిహెచ్‌ఆర్‌ఎం, ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఎంబిఎ చేశారు. రైల్వేలో 26 సంవత్సరాలకుపైగా అనుభవం కలిగి ఉన్నారు. సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే, సౌత్ ఈస్టర్న్ రైల్వే, ఈస్ట్‌కోస్ట్ రైల్వేల్లో వివిధ హోదాల్లో పనిచేశారు.

కొద్ది రోజుల క్రితం వాల్తేరు డిఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ ముంబయిలో ఓ వ్యక్తి నుంచి రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ సిబిఐకి పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాత్కాలిక డిఆర్‌ఎంగా మనోజ్ కుమార్ సాహూను నియమిస్తూ రైల్వే ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు.

అటవీ చట్టంపై అవగాహనకు శిక్షణ

ప్రజాశక్తి- రంపచోడవరం : ఏజెన్సీలోని కొండపోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులకు అడవి హక్కుల చట్టంపై అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఆదేశించారు. గురువారం స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్ సమావేశపు హాల్లో జన్ జాతీయ గౌరవ్ దివాస్ కార్యక్రమం ద్వారా అడవి హక్కుల చట్టంపై అవగాహన శిక్షణ కార్యక్రమానికి రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీతో కలిసి పాల్గొన్నారు.. ఈసందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ 2005 డిసెంబర్ 13నాటికి కొండపోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులకు ఆయా భూములపై హక్కులు కల్పించేలా ప్రభుత్వం చట్టం చేసిందని, దానిపై అవగాహన ఉండాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అడవి హక్కుల ద్వారా పట్టాలు పొందిన గిరిజన రైతులకు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా కొన్ని పథకాలు ప్రవేశపెట్టారన్నారు. . 2005కు సాగులో ఉన్నవారికి అర్హులైన వారందరినీ గ్రామ సభల తీర్మానాలతో వారి అర్హతను బట్టి పట్టాలు మంజూరు చేశారన్నారు.

రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ మాట్లాడుతూ ఈనెల 21, 22 తేదీల్లో రెండు రోజులపాటు అటవీ హక్కుల చట్టంపై రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమానికి రంపచోడవరం, పాడేరు, సీతంపేట, కే.ఆర్.పురం, చింతూరు, పార్వతీపురం ఐటిడిఎల నుంచి ఆర్‌ఓఎఫ్‌ఆర్ అధికారులు, అటవీ హక్కుల కమిటీ మెంబర్లు, పట్టాదారులు హాజరయ్యారన్నారు. శిక్షణ కార్యక్రమానికి రీసోర్సు పర్సన్స్‌గా రామ్ గోపాల్, ఈశ్వరరావు, చంద్రకళ, మోహనరావు, సంధ్య వ్యవహరించారు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ, ఆర్‌ఒఎఫ్‌ఆర్ సెల్ ప్రతినిధి జి ఆనంద్, యూత్ ట్రైనింగ్ సెంటర్ మేనేజర్ సుదీష్ ,ప్రాజెక్ట్ మానిటరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరు సర్వే పారదర్శకంగా నిర్వహించాలని స్థానిక ఎంపిడిఒ లోకుల యాదగిరేశ్వరావు సిబ్బందిని ఆదేశించారు.గురువారం మండలంలోని జడ్డంగి పంచాయతీ సచివాలయ సిబ్బంది చేపడుతున్న జియో టాకింగు సర్వేను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్న తీరుపై నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సర్వేను నిర్వహించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఆదేశించారు. ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేయాలని, పంచాయితీల్లో మౌలిక వసలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సచివాలయ సిబ్బంది ఉన్నారు.

శాంతిరాజుకు ఘన నివాళి

ప్రజాశక్తి -మారేడుమిల్లి : మండల కేంద్రం మారేడుమిల్లి స్తూపం సెంటర్ వద్ద సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు కెపి శాంతి రాజు వర్ధంతిని గురువారం న్యూ డెమోక్రసీ అధ్యక్షుడు కత్తుల సుగ్గరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు కుంజ దూలయ్య మాట్లాడుతూ మారేడుమిల్లి మండలం పుల్లంగి గ్రామంలో జన్మించిన శాంతిరాజు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడిగా, మండల అధ్యక్షుడిగా చురుగ్గా పనిచేస్తూ ఆదివాసుల హక్కుల కోసం, పోడు భూముల పట్టాలకు ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అనంతరం రంపచోడవరం ఎకెఎం ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి పల్లాల లచ్చిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం, ఆదివాసీలకు వ్యతిరేకంగా పనిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మన్యంలోని అటవీసంపదను కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటమే శాంతిరాజుకు ఇచ్చే నివాళి అన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కంగల బాలుర దొర, జిల్లా నాయకుడు కత్తులు బాలు రెడ్డి, పి ఓ డబ్ల్యు నాయకులు అనసూయ,మండల నాయకులు బచ్చల మంగిరెడ్డి, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

రిసార్ట్స్ యజమానుల సమావేశం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : స్థానిక సెవెన్ హిల్స్ రిసార్ట్స్‌లో గురువారం రిసార్ట్స్ ఓనర్స్ యూనియన్ సభ్యుల సమావేశం నిర్వహించారు. టూరిజంపై ఆంక్షలు, యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, వాటిని జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్, డిఎఫ్ఒల దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. ఈసందర్భంగా రాజమండ్రి రిసార్ట్స్ యూనియన్ ప్రెసిడెంట్ బి.మధు, మారేడుమిల్లి రిసార్ట్స్ యూనియన్ ప్రెసిడెంట్ కె రాజ్ కుమార్‌లను సత్కరించారు. కార్యక్రమంలో టూరిజం గౌరవ అధ్యక్షులు పి జయరావు,బి.వెంకట్, రామదుర్గం, షేక్ సుభాని, రబ్బాని, బి గంగరాజు, పి కొండబాబు, ప్రభాకర్ పాల్గొన్నారు.